


**"ఇవాళ నా పుట్టిన రోజు..." అబద్ధం ఆడింది జానకి. నిజానికి తన పుట్టిన రోజెప్పుడో ఆనందానికే కాదు తనకే తెలియదు. మరిచిపోయింది అలాంటి సరదాలనెన్నిటినో... అనాలోచితంగా అనేసింది. అన్నాక సంతోషించింది.....**

జానకి మొగుడు తాగుతాట్టగా'

'ఏవే జానకీ అన్ని కబుర్లు చెప్తావు. తాగుడు మాన్పించలేవూ మీ ఆయన చేత ...'

'వెధవ తాగుడు. కొంపలు గుండమై పోతాయి. సంసారాలు ఎక్కిరావు ...'

'తాగుబోతుతో ఎట్లా వేగుతున్నావ్ ...'

'మీ మామయ్యకూడ ఇట్లాగే తాగి తాగి హరీ మన్నారు. అనుకుని ఏం ప్రయోజనం ... జాగ్రత్త పడు ...'

'ఆ తర్వాత ఏమనుకునీ ఏం లాభం లేదు ... ఏ కాన్సరో రాకముందే ...'

వినలేనట్లు చెవులు మూసుకుంది జానకి.

చెవులు మూసుకున్నా విన్పిస్తున్నాయి ఆ మాటలు.

జానకి మేనమామ చచ్చిపోతే వెళ్ళొచ్చింది... అప్పట్నించీ ఆమాటలు ...ఆ ఎగతాళి ధ్వనులు ... హెచ్చరికలు వుండి వుండీ గుండెల్లోంచి బయల్దేరి, గుబులు పుట్టిస్తున్నాయి.

పక్కకి వొత్తిగిల్లింది ... మసక వెల్తుర్లో పిల్లలు పడుకున్న తీరు చూసి జానకి తల్లిగుండె చెరువ యింది .. చిరుగుల చాప .. అతుకుల బొంత.

అతుకులు కూడా నిలవని చొక్కాలు ... పెరుగుతున్న వయసుని దాచలేని చిరుగుల జాకెటు తో పెద్దపిల్ల సరళ ..

"అమ్మాయి పెద్దదవుతోంది .. అలా చిరిగిపోయిన లంగాలు, జాకెట్లు తొడక్కు ... మా పెద్దదాని బట్టలు పొట్టయిపోయాయి. సరళకి సరిపోతాయి తీసుకో ..." అని అక్కయ్య రెండు జతలు బట్టలు ఇచ్చింది.

అక్క ఔదార్యంతో ఇచ్చినా అవమానంతో కృంగిపోయింది జానకి ...

తల్లీ తండ్రి ముందు, తోబుట్టువుల ముందు తన స్థితి అలా వేలెత్తి చూపబడటం ఎంతో మనస్తాపాన్ని కలిగించింది.

బావురుమని ఏడవాలనిపించింది.

తల నేలకేసి పగల కొట్టుకోవాలని పించింది. ..

అలనాడు జానకిని మింగినట్లు ఈ భూమి రెండు ముక్కలై తనని మింగేస్తే బావుండుననిపించింది ...

బావగారి ఆదాయం ఈయనకంటే తక్కువే ..

అయినా వాళ్ల సుఖంగా వున్నారు. శుభ్రంగా వున్నారు. ఆరోగ్యంగా వున్నారు. ఆనందంగా వున్నారు.

మరితను, తన పిల్లలు!

భగవాన్ ...

ష్ ... ఈయన తాగుడు మానేస్తే ఎంత మిగులు.

హు .. పన్నెండు సంవత్సరాల నించీ పోరుతోంది తను ... పోరు మిగిలింది. ఆయన మారలేదు.

'పోనీ నేనూ, పిల్లలూ తినో, తినకో ఎలాగో అలా చస్తాం... ఆరోగ్యం పాడై పోతుందన్న ఇంగితం అన్న లేదే ఈ మనిషికి.

ఇప్పుడు కనీసం తిండన్నా తింటున్నాం ...

రేపు ఆయనేమన్నా అవుతే ...!

ఝుం ఝుా నిలంలో కిసలయంలా వొళికిపోయింది జానకి. ఒళ్లంతా చెమట్లు పట్టాయి.

గుండె వేగం హెచ్చింది ...

అలా జరగడానికి వీల్లేదు.

తిట్టనీ, కొట్టనీ, ఏమైనా చెయ్యనీ రేపట్నుంచీ ఆయన్ని తాగనివ్వదు తను ...

పన్నెండు సంవత్సరాల నించీ వినని మనిషి ఇప్పుడు వింటారా? వినాలి. వినేటట్లు చెయ్యాలి. వినేలా చెప్పాలి ... ఇన్నాళ్ళూ పోట్లాడినా చుట్టు పక్కల వాళ్ళ దృష్టిలో చులకనైపోతామని నోరునొక్కుకుని, దుఃఖాన్ని దిగమింగుకుని వూరుకుంటూ వచ్చింది తను ...

ఇహ అలా జరగడానికి వీల్లేదు.

ఎవరన్నా ఏమైనా అనుకోని ... భర్త ఆరోగ్యం కన్నా తనకి ఏదీ ముఖ్యంకాదు ...

గెలిచేవరకూ పోట్లాడాలి.

ఆయన తాగుడు మానాలి.

భర్త చేత ఎలాగైనా సరే తాగుడు మాన్పించి తీరాలన్న నిర్ణయానికి వచ్చి, దాన్ని మర్నాటినించే అమలు జరపాలన్న, నిశ్చయంతో కళ్ళు మూసుకుంది జానకి ...

జానకి కళ్లకి తాగుడు వల్ల చచ్చిపోయిన మేనమామ ... ఆ శవం మీద పడి ఏడుస్తున్న అత్త, పిల్లలూ కన్పిస్తున్నారు ...

ఆ దృశ్యాన్ని బలవంతంగా తొలిగించింది ...

భర్త తాగుడు మానినట్లూ — అతన్ని అలా మార్చగలిగినందుకు అందరూ తనని అభినందిస్తున్నట్లూ చిత్రాల్ని రచించుకుంటూ నిద్రలోకి జారింది జానకి!

* * *

ఒక చెయ్యిలేని తాతల కాలంనాటి పేము కుర్చీలో కూర్చుని గోడకి కాళ్లుతన్నిపట్టి మనసావాచా త్రికరణ శుద్ధిగా బీడీకాలుస్తున్నాడు ఆనందం.

తను మొగవాడు .. ఎంత చెడ్డా మగవాడు .. అది ఆడది .. ఎంత భార్యయినా ఆడది .. అలా మాట్లాడుతుందా .. ఇదేవన్నా కొత్త సమస్యా .. పన్నెండు సంవత్సరాల నించీ జరుగుతున్నదే .. అయినా పూటపూటకీ మళ్లీ కొత్తే 'ఛట్' ఆరిపోయిన బీడీని నేలకేసి కొట్టాడు ..


'టుబీ ఆర్ నాట్ టుబీ' అని అలనాడేనాడో హామ్లెట్ సందిగ్ధావస్థలో పడ్డట్లు 'మానడమా .. మానకపోవడమా' అన్న మీమాంసలో పడలేదు ఆనందం ...

ఎందుకు మానాలి ? కష్టపడి సంపాదించుకుంటున్నది అనుభవించడానికే కదా .

తను రిక్షాలో తిరగొచ్చు, వీక్లీలు కొనచ్చు, పాన్ వేసుకోవచ్చు, ఆఫీసులో రెండు మూడు సార్లు 'చా' తాగొచ్చు .. ఫిల్టర్ సిగరెట్లు కాల్చొచ్చు .. రోజూ ఇస్త్రీ చేసిన బట్టలు తొడగచ్చు. కేశపోషణార్థం సువాసన్న తైలాలు వాడచ్చు. హవాయ్ స్లిప్పర్లు వొదిలి లెదర్ చెప్పులు కొనుక్కోవచ్చు. సినిమాలు చూడచ్చు ..

ఇన్నిరకాల సరదాల్ని తనువిడిచేసాడు .. కాదు .. ఏవిటబ్బా అది .. ఆ .. త్యాగం చేసాడు !!

దేనికోసం ...



మందుకోసం ...

మందుకోసం తనేం ప్రత్యకంగా ఖర్చు పెట్టడం లేదే .. మరో ఖర్చుల్ని తగ్గించుకుంటున్నాడు. ఎంత చెప్పినా అర్థంచేసుకోదేం ..

'ఈ ఆడాళ్లంతా నాశి సెంటిమెంటల్ ఫూల్స్రేయ్' అని గిరీశం అన్నట్లు వాళ్ళ మేనమామెవడో తాగి తాగి సిరోసిస్‌తో చచ్చాట్ట .. అదీ సెంటిమెంటు .... దానిమీద రెండు గంటల ఆర్గ్యుమెంటు .. కన్నీళ్ళు .. నాన్సెన్స్ ..

మగాడన్నాక మందుకొడ్తాడు!

మళ్ళీ మాట్లాడితే పెళ్లాన్ని కూడా కొడ్తాడు !!

అసలు దీని గురించి ఇంతసేపు ఆలోచించడం ఏవిట్నను.

ఠక్కున లేచి నిలబడి చొక్కా తొడుక్కున్నాడు .. అద్దం ముందు నిలబడి తల దువ్వుకున్నాడు .. తల దువ్వుకుంటూ చూసాడు.

గోడమీద ఫోటోలో ఆనందాన్ని. స్మార్ట్‌గా నవ్వుతున్నాడు .. ముఖం నున్నగా వుంది .. కళ్ళు కాంతివంతంగా వున్నాయి. అదేదో మందుల కంపెనీ వారి టానిక్ ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లా వున్నాడు ..

అద్దంలో చూసుకున్నాడు ఆనందం ..

ముఖం ఎండిపోయి పాడిపాడిగా వుంది .. పెదవుల్ని సాగదీసి నవ్వాడు .. నవ్వుతున్నట్లు లేదు. కళ్ళు అలసటగా వున్నాయి .. కళ్ల కింద నల్లటి చారలు .. వాటికింద ఉబ్బిన కండలు ...

చటుక్కున దృష్టి మరల్చాడు ఆనందం.

ఛ .. వెధవ అద్దం. పాతబడి పోయింది. కొత్తది కొనాలి.

జేబులు తడువుకున్నాడు ..

జేబులో వుండాల్సిన పదిరూపాయిల నోటు చేతికి తగల్లేదు ... పాంటు జేబులో వెతికాడు. ఊహు .. అక్కడాలేదు .. ఏమైనట్లు ..

వంటింట్లోకి తొంగి చూసాడు.

మబ్బుల్లో చందమామలా కట్టెలపొయ్యి పొగ మధ్య భార్య.

పొగవల్లనో, పొగరుగా మాట్లాడి తిట్లు తిన్నందువల్లనో ముక్కు చీదుతూ కళ్ళు తుడుచుకుంటోంది ..

మరెక్కడైనా పెట్టానేమోనని ఇల్లంతా వెదికాడు. దొరకలేదు.

ఒకపక్క మందువేళ మించిపోతోంది ..

'పదండి ముందుకు .. పదండి ముందుకు' అని లోపల్నుంచి ఎవరో గంటలు కొట్టి తరుముతున్న ఫీలింగ్ .. ఆ ఫీలింగ్ వచ్చాక అరనిమిషం కూడా ఆగలేదు ఆనందం.

ఇప్పటికిప్పుడు అప్పుకూడా ఎక్కడా పుట్టదు.

ఈ పది కూడా ఫ్యాన్ అప్పారావు దగ్గర అప్పు తెచ్చింది.

జానకేమన్నా తీసిందా?

'ఏవే ..!' పిల్చాడు ..

పిలుస్తాడని తెల్సు జానకికి . బదులు పలకలేదు.

'నిన్నే .. జేబులో డబ్బేమయినా తీసావా :. ఒసే నిన్నే' అరిచాడు.

'తీసాను' అంది జానకి వంటింట్లో నుంచే ..

'ఇలా ఇవ్వు'

జానకి గుండెల్లో సన్నటి వొణుకు వచ్చింది. ఇవకపోతే భర్త ఏం చేస్తాడోనని భయపడి పోయింది ఇచ్చేద్దామా అనుకుంది .. ఇంధాక రెండు గంటల సేపు జరిగిన వాగ్యుద్ధానికి ఫలితం లేకపోయింది. అందుకే జేబులో డబ్బుతీసి దాచింది. ఇచ్చేస్తే .. ఇవ్వనుగాక ఇవ్వను. రాత్రి తీసుకున్న నిర్ణయం అమలు జరిపి తీరాలి.

'త్వరగా ఇవ్వు ..' అసహనం ఆనందం గొంతులో స్పష్టంగా తెలుస్తోంది.

జారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని నెమ్మదిగా అంది, 'లేవు.'

ఆ మాటవిని ఆనందం ఉగ్రుడైపోయాడు, 'ఏం చేసావ్ ..'

'మొన్న పక్కింటి వాళ్ళ దగ్గర తీసుకున్నాను. వాళ్ళు అడిగితే ఇచ్చేసాను.'

ఆనందం రెచ్చిపోలేదు. రెండు క్షణాలు మవునం తర్వాత పేము కుర్చీలో కుర్చున్నాడు. ఆనందం చెయ్యి వొణుకుతోంది.

కొపాన్ని దిగమింగుకోవడంవల్ల అలా వొణుకుతోందనుకుంది జానకి .. కానీ మితిమీరిన తాగుడువల్ల, బీడీలు విపరీతంగా కాల్చడంవల్ల వచ్చిన నెర్వెస్, వీక్‌నెస్ అని తెలియదు.

మరో రెండు క్షణాలు నిశ్శబ్దంలో దొర్లాక ఆనందం లేచి నిబడ్డాడు. 'ఎక్కడో అక్కడ అప్పుకి చావాలిప్పుడు .. ఇంకెప్పుడూ నన్నడక్కుండా జేబులో డబ్బులు తియ్యకు.' అని గుమ్మం వైపు నడిచాడు.

తను పది రూపాయిలు దాచి ప్రయోజనం లేకపోయింది.

అది లేకపోతే కదలరనుకుంది.

తన ప్రయత్నం వృధా అయిపోతుంది.

కాకూడదు. గుమ్మానికి అడ్డంగా నిలబడి అంది, 'ఇవాళ మీరు తాగొద్దు ..'

ఈ మాట జానకి అనడం తను వినడం మామూలే ఆనందానికి .. ఇందాక జరిగిన యుద్ధంలో కూడా ప్రతి రెండో మాట ఇదే .. అయినా ఇప్పుడు జానకి .. చెప్తున్న పద్ధతిలో, కంఠంలో పలుకుతున్న ధ్వనిలో ఏదో తేడా వుంది .. తనని ఎలాగైనా తాగనివ్వకూడదన్న పట్టుదల వున్నట్లు గ్రహించాడు ఆనందం.

ఎక్కడ బైటకి వెళ్ళిపోతాడో అన్నట్లు ఆనందం చెయ్యిపట్టుకుంది జానకి.

"బైటికి వెళ్లనీయకుండా కట్టేస్తావా?" కళ్ళెర్ర చేసాడు.

" ఇవాళ్ళ ఒక్కరోజూ మీరు తాగొద్దు .."

ఒక్కరోజు, కనీసం ఒక్కరోజు మాన్పించగలిగితే, ఆ తర్వాత నెమ్మదిగా మార్చగలనన్న ఆశతో అంది జానకి.

"ఇవాళ ఒక్కరోజూనా .. ఎందుకు?"

"ఇవాళ నా పుట్టిన రోజు ..." అబద్ధం ఆడింది జానకి. నిజానికి తన పుట్టిన రోజెప్పుడో ఆనందానికే కాదు తనకే తెలియదు. మరచిపోయింది అలాంటి సరదాలనెన్నిటినో .. అనాలోచితంగా అనేసింది. అన్నాక అలా అన్నందుకు సంతోషించింది తన మీద వీసమెత్తు ప్రేమవున్నా ఇవాళ తాగరు...

"ఇలాంటి పుట్టిన రోజు పండుగలు కనీసం ఓ వెయ్యన్నా జరుపుకోవాలని నా ఆకాంక్ష .. గుడ్ .. ఇవాళనీ పుట్టిన రోజు అంటున్నావు కనుక నేను తాగడం మానేస్తే బావుంటుంది ..."

పన్నెండు సంవత్సరాలుగా పడ్డ బాధని మర్చిపోయింది. తట్టుకోలేనంత సంతోషం కళ్ళల్లో తడిగా మెరిసింది.

"కానీ జానకీ .. తాగకపోతే నాకు తిక్కగా వుంటుంది. చిరాగ్గా వుంటుంది. అన్నం తినలేను.. నీతో సరదాగా గడపలేను .. నీ పుట్టిన రోజు పండుగ మన శోభనం రాత్రి గుర్చుకొచ్చేలా గడపాలి ... నువ్వివాళ సంతోషంగా వుండాలి. నిన్ను సంతోషంగా వుంచాలంటే నాకు మూడ్ కావాలి. తాగుడుదేముంది. ఇవాళ్ళ ఒక్కరోజు మానెయ్యడం పెద్ద కష్టం కాదు. మానేస్తాను. బట్ .. నీ సుఖం కోసం .. నిన్ను సంతోష పెట్టడం కోసం నీ మూడ్‌ని పాడుచెయ్యకుండా నేను మూడ్‌లో వుండటం కోసం నేను తాగాలి .. తప్పదు." అన్నాడు ఆనందం జానకిని కౌగిట్లోకి తీసుకుంటూ ..

జానకి నమస్తనాడులూ కదిలిక కోల్పోయాయి.

తను ఒకలా భావిస్తే మరోలా జరిగింది...

క్షణంలో తెప్పరిల్లి, "మీరు ఇంట్లో వుంటే చాలు. చిరాకుపడినా, కొప్పడినా, తిట్టినా చివరికి తన్నినా సరే .. తాగకుండా వుంటే అంతే చాలు .. అదే నాకు సంతోషం .. మీరు తాగొద్దు .." బ్రతిమాలింది. అలాంటి అర్థం వచ్చేలా రకరకాల పదాలతో చెప్పింది ..

ఆనందం ససేమిరా అన్నాడు.

తాగుడు వల్ల తామెంత నష్టపోయామో నలుగురిలో ఎంత చులకనై పోయామో ఆరోగ్యానికి తాగుడు ఎంత హానికరమో .. చెప్పినదే .. చెప్పినదే మళ్ళీ, మళ్ళీ, మళ్లీ చెప్పింది.

ఏకళనున్నాడో అన్నీ తాపీగా విన్నాడు ఆనందం.

నిజానికి విన్లేదు .. ఆనందం మస్తిష్కం మందు దొరికే మార్గాల్ని అన్వేషిస్తోంది.

ఉన్నట్లుండి చటుక్కున వంటింట్లోకి నడిచాడు

ఇంట్లో మిగిలిన ఒకేఒక్క ఇత్తిడి గిన్నె పట్టుకుని వచ్చాడు.



### పేరు

తెలుగు పాఠం చెబుతున్నారు సత్యం మాస్టారు.

"సావిత్రి భర్త పేరేమిటిరా గోపీ" అని అడిగాడు

"వ్రత సార్" చెప్పాడు గోపీ

"అదెలా" అర్థంగాక అడిగాడు మాస్టారు

"మీరే చెప్పారు కదా సార్ సావిత్రి పతివ్రత అని" ఠక్కున చెప్పాడు గోపీ.

—బద్దిగం అరుణశ్రీ (కరీంనగర్)

### చేష్టలు



అంతకముందు ఎన్నోస్లీలు, ఇత్తడి సామాన్లు వసనం వేడికి కరిగి సారాగా మారి పోవడం తెల్సు జానకికి ..

'ఛీ' పన్నెండు సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత తన ప్రత్యక్ష దైవాన్ని ఛీత్కరించింది మనసులోనే ..

మొండి పట్టుదలతో ఆనందం చేతిలో గిన్నెలాక్కుంది.

ఇంతకు ముందెన్నడూ జరగని ప్రతి చర్య ఇది. క్షణకాలం నిశ్చేష్టుడయ్యాడు ఆనందం.

జానకి చేతిలో గిన్నెలాక్కోబోయాడు.

భళ్లున పట్టు పట్టింది జానకి.

జానకిని నోటికొచ్చినట్లు తిడుతూ గిన్నెలాక్కోవాలని ప్రయత్నిస్తున్నాడు ఆనందం ..

అప్పుడే ఆటల్నుంచి ఇంటి కొచ్చిన పిల్లలు జరుగుతున్నదేవిటో అర్థంకాక అయోమయంగా చూస్తూండి పోయారు.

"వొదులు .. వొదులే .. వొదలకపోతే చంపేస్తాను .." ఇల్లెగిరి పోయేలా అరుస్తున్నాడు ఆనందం..

పళ్ళు గిటకరించి, పట్టు మరింత పుధృతం చేసింది జానకి.

మందుమాట ఎలావున్నా, తను వోడిపోతున్నానన్న భావన ఆనందాన్ని రెచ్చగొట్టింది.

"వొదలవూ .." విసురుగా వెనక్కి తోసాడు.

ఆ వూపుకి గోడకి కొట్టుకుంది జానకి తల.

'అమ్మా' అప్రయత్నంగా అన్నారు పిల్లలు.

ఇత్తడి గిన్నె చేతిలోకి తీసుకుని రొప్పుతున్నాడు ఆనందం ..

జానకి సహనం సరిహద్దు దాటింది.

మంచిమాటల్తో చెప్పింది లాభం లేదు,

పోట్లాడింది ప్రయోజనం లేదు.

బలవంతంగా ఆపే శక్తి లేదు ..

ఒక్కటే మార్గం .. అన్నింటికీ పరిష్కారం అదే .. అంతే దానికి లొంగాలి .. మారి తీరాలి ..

"ఆగండి.." జానకి స్వరంలో ధ్వనించిన తీవ్రతకి ఆగాడు ఆనందం..

"ఇవ్వాళ మీరు తాగడానికి వీల్లేదు. కాదూ కూడదని తాగివస్తే నా శవాన్నే చూస్తారు. నేనొక్కదాన్నే చా వను. నలుగురు పిల్లల్నీ చంపి నేను చస్తాను ..." ఒక్కొక్క అక్షరాన్నే దృఢంగా పలుగుతూ అంది ..

గత పన్నెండు సంవత్సరాలుగా ఎన్నో రకాలుగా తనని మార్చడానికి విఫల యత్నం చేసిన జానకి ప్రయోగించిన ఈ కొత్త అస్త్రం ఆనందరావుని క్షణకాలం సేపు ఆలోచింప చేసింది.

అంతలోనే ఆనందరావులో పురుషాహంకారం ఫీంకరించింది .. "నేను మొగవాణ్ని .. నన్ను శాసిస్తుందాట ఆడది .. అందునా పెళ్లాం.. ఇట్లాంటి బెదిరింపులకి లొంగిపోతే .. చేసేవాళ్ళు చెప్పరని .. కాస్త మందు కొడితే ఇంత అల్లరి చేయాలా .. నాన్సెన్స్ .. తన డబ్బు తనిష్టం తను తాగుతాడు .. అంతే ..

"నీ ఇష్టం వొచ్చినట్లు చావు .." అనేసి చరా చరా బైటకి వెళ్ళి పోయాడు ఆనందం ..

తను చచ్చిపోతానన్నా ఖాతరు చెయ్యని మనిషి మీద ఏమ్మాత్రం విలువలేని తన బ్రతుకుపట్ల రోత కలిగింది జానక్కి.

తను చచ్చాక నాన్నా మారతారా ..

మారనీ మారకపోనీ తనూ బ్రతకడం అనవసరం ..


"అమ్మా ఆకలేస్తోందే...... " మూడోపిల్లాడు జానకి చీర గుంజుతూ అడిగాడు...

పిల్లల్ని చూసింది జానకి.

బెదురుతున్న కళ్ళతో తలోమూల నిలబడివున్నారు. తను బ్రతికుండగానే వీళ్ళ బ్రతుకులు ఇట్లావున్నాయే... తను చచ్చిపోతే వీళ్ళని ఎవరు చూస్తారు. తాగుబోతు తండ్రి చూస్తాడన్న నమ్మకంలేదు....

తన జీవితాన్ని ఈ క్షణాన అంతం చేసుకోగలదు తను.

కాని పిల్లలు?



### విచారం

"నేనొక పత్రికా సంపాదకుడికి ఎంతో విచారం కలిగించాను" అన్నాడు దేవానంద్.

"అదెలా" అడిగాడు సదానంద్

"ఒక జోక్ పంపాను. ప్రచురణార్హం కాదని, తిప్పి పంపుతున్నందుకు ఎంతో విచారిస్తున్నామని ఆ సంపాదకుల వారు కార్డు పంపించారు" చెప్పాడు దేవానంద్

—బద్దిగం అరుణశ్రీ (కరీంనగర్)

అనాథలై రోడ్డెక్కితే....

అలా జరక్కూడదు... మరి తన పరిస్థితేమిటి? చచ్చిపోతానన్నా లక్ష్యపెట్టని మనిషిని ఏ స్త్రీ అయినా ఎట్లా భరించగలదు?

ఇలా తర్జన భర్జనలు జరిగాక

ఆడది జానకిని తల్లి జానకి గెల్చింది!

* * *

వేదాల సారాన్ని బుర్రకెక్కించుకున్నా, వేదనల భారాన్ని బుర్ర మోయలేక పోయినా మనిషి వేదాంతి అయిపోతాడు.

జానకి వేదాంతి కాలేదు కానీ నిర్లిప్తత — ఎలా జరిగితే అలా జరగని అన్న ఉదాసీన భావం జానకిలో చోటు చేసుకున్నాయి.

ఏనాటికైనా భర్త మారకపోతాడా. అని అంతరాంతరాళ్ళలో మినుక్కు మినుక్కు మంటున్న ఆశకి ఇవాళే సమాధి కట్టబడింది.

ఎన్ని విధాలుగా చెప్పాలో అన్ని విధాలుగా చెప్పి చూసింది తను. మారకపోగా ఇంట్లో పోట్లాట...


తాగని, ఆతనిష్టం వచ్చినట్లు తాగనీ... తెచ్చి పడేస్తే వండుతాను. లేకపోతే లేదు...

ఇక ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే తాగుడు విషయమై భర్తతో పోట్లాడకూడదు అని నిర్ణయించుకుంది జానకి.

అలా నిర్ణయించుకున్న తర్వాత అందుకు ముందువున్న టెన్షన్, ఆవేశం, బాధ, భయం తగ్గి ఆస్థానే ఓ రకమైన ప్రశాంతత చోటు చేసుకుంది.

తుఫానుకి ముందే కాదు, తుఫాను తర్వాత

### టానిక్



కూడా ప్రశాంతత సహజమే!

*   *   *

మర్నాడు, మందు వేళ.......

బైటికి వెళ్తున్న ఆనందాన్ని జానకి వద్దనలేదు.

హుషారుగా బైటికి నడిచాడు ఆనందం.

ఇంటికి వచ్చే సరికి పదయింది.

జానకి విసుక్కోలేదు. నవ్వుతూ తలుపుతీసింది.

అన్నం పెట్టింది..అనువుగా కౌగిట్లో ఇమిడింది.

మందు కొట్టివచ్చినతర్వాత ముఖం చిట్లించడాలూ, పక్కలు దూరం చేసుకోవడాలూ లేకుండా.... ఇలా... ఇలా వుండాలని ఆనందం కోర్కె.

ప్రపంచాన్ని జయించినంత తృప్తిగా నిద్రపోయాడు.

ఇలా ఒకటి, రెండు.... పది రోజులు గడిచాయి.

జానకి ప్రవర్తనలో ఎలాంటి మార్పురాలేదు...

ఆనంధం తాగనప్పుడు ఎలా ప్రవర్తిస్తోందో, తాగినప్పుడూ అలా ప్రవర్తిస్తోంది.... గతంలో వేరుగా వుండేది..

ఇలా వుండాలి... ఇలావుంటే బాగుంటుంది అని ఎన్నోసార్లు అనుకున్నాడు ఆనందం.

ఇప్పుడు జానకి పోట్లాడకపోవడమే విచిత్రంగావుంది.

జానకి ప్రవర్తన చాలా అసహజంగా వున్నట్లు తోస్తోంది. కన్‌ఫ్యూజ్ అయిపోతున్నాడు ఆనందం.

సమ్‌థింగ్ రాంగ్...

ఎందుకిట్లా అనిపిస్తోంది... మందుకొట్టి మరీ ఆలోచిస్తున్నాడు ఆనందం....

తనింక మారదన్న నిర్ణయానికి వచ్చేసిందా?

అదే అవుతే ఆ నిర్ణయం తీసుకోవడానికి ఇన్ని సంవత్సరాల వ్యవధిఅఖర్లేదే... డబ్బుసంగతి కన్నా తన ఆరోగ్యం గురించి ఎక్కువగా బాధపడేదే...

'ఏమైనా కానీ' అనుకుందా.... అలా అనుకుందంటే తన మీదవున్న ప్రేమనీ, బంధాన్నీ పూర్తిగా తుడిచేసుకుందా.....

అని ఆలోచిస్తున్న ఆనందం హఠాత్తుగా తాను' ఒంటరివాడినైనట్లు ఫీల్ అయ్యాడు...

నవ్వుతూ మామూలుగా ప్రవర్తిస్తున్న జానకి ఆనందానికి అంతుబట్టడంలేదు...

'జానకినే అడిగితే.....!'

'ఒరేయ్ మొగుడా... నాకంటూ అనీ సంపాదనలేదు. కనుక నువ్వు చేసే దగుల్బాజీ పన్లు సహిస్తూ నీ కాళ్ళ దగ్గర పడివున్నాను... ఇళ్ళూ, వొళ్ళూ గుల్లచేసుకుంటున్నా నోరు మూసుకుని చూస్తున్నాను... కేవలం తిండికీ, బట్టకీ నీకూ నీ పిల్లలకీ అడ్డమైన చాకిరీలు చేస్తున్నాను.. నువ్వెలా ఏడ్చినా నాకు అనవసరం... వ్యభిచా రం చెయ్యడానికి నీదగ్గర భార్య వుద్యోగం చేస్తున్నాను....' అని అంటే!

అ నిజాన్ని మింగగలడా తను.

'నో...'

నిజమెంత చేదు...

ఊహిస్తేనే ఇంత చేదుగావున్నది నిజమైతే భరించగలడా తను

జానకిని డైరెక్ట్‌గా అడక్కూడదు. అడక్కుండా తెల్సుకోవాలి.

"జానీ..."

"ఊ..."

"తాగొచ్చానని కోపంగావుందా?"

"ఊహూ...."

కోపం లేదంటూంటే ఏం మాట్లాడాలో అర్థం కాలేదు ఆనందానికి. కోపంగావుంది అంటే— ఆకోపం వఠి అర్థరహితమనీ, తాగుడులో చాలా సుఖం వుందనీ, తాగుబోతులందరికీ సిరోసిస్ రాదనీ, కాన్సర్‌కి కారణం తాగుడొక్కటే కాదనీ, తాగుబోతుల వల్ల ప్రభుత్వానికి బోలెడంత ఆదాయం వుందనీ ఎంతలేదన్నా ఓ రెండు గంటల లెక్చరు ఇచ్చేవాడు.

ఆ అవకాశం దొరకలేదు. పరీక్షగా జానకి ముఖంలోకి చూసాడు.

నవ్వుతూవుంది. ఆనవ్వులో నిరాశా, నిర్లిప్తతో, ఎగతాళో, బాధో, వ్యంగ్యమో ఏదో ఒకటి కనిపిస్తుందేమో నని వెతికాడు... ఉహూ....

"ఇదివరకు తాగితే పోట్లాడేదానివి..."

"ఇప్పుడవన్నీ ఎందుకు... మల్లెపూలుచూడండి ఎంత కమ్మటి...."

"వాసన వెయ్యడం లేదూ..."

"......."

"ఈ వాసన నీకు అసహ్యం కదూ... వెగటు ..."

"ఇప్పుడు లేదు...."

"అలవాటయిపోయిందా?"

"అవును!" అని జానకి అంటే వూపిరి పీల్చుకుందామనుకున్నాడు ఆనందం. అన్లేదు.

మెత్తగా నవ్వింది జానకి తన సమాధానం అదేనన్నట్లు!



## డ్యూటీ

"ఆ పోస్ట్‌మెన్ డ్యూటీని ఎంతో సక్రమంగా చేస్తాడు. తనకొచ్చే ఉత్తరాల విషయంలో కూడా" అన్నాడు భీమారావ్

"అంటే" అడిగాడు సందేహరావు

"అతనికే ఏదయినా ఉత్తరం వచ్చిందనుకో, తన ఇంటి ముందు నిలబడి "పోస్ట్" అని కేకపెట్టి ఇంట్లోకి ఉత్తరం విసిరేస్తాడు. ఆ తర్వాత లోపలికి వెళ్లి ఉత్తరాన్ని తీసి చదువుకుంటాడు" చెప్పాడు భీమారావ్.

—బద్దిగం అరుణశ్రీ (కరీంనగర్)

## నిజమా!





## సంభవం

సాక్షిగా సదాశివాన్ని కోర్టులో ప్రవేశపెట్టారు.

"నువ్వు సినిమా నుండి యింటి కొచ్చేసరికి ఎంతయింది?" అడిగాడు లాయర్

"పన్నెండు" చెప్పాడు సదాశివ

"హత్య ఎప్పుడు జరిగింది"

"పన్నెండు"

"పోలీసులకెప్పుడు ఫోన్ చేసావు"

పన్నెండు"

"వాళ్లెప్పుడొచ్చారు"

"పన్నెండు"

"డామిట్! ఇవన్నీ పన్నెండు గంటలకే జరగడం అసంభవం" విసుక్కున్నాడు లాయర్

"అప్పుడు ఆగిపోయిన నా రిస్ట్‌వాచ్ ప్రకారం జరగడం సంభవం" నవ్వుతూ చెప్పాడు సదాశివం

—బద్దిగం అరుణశ్రీ (కరీంనగర్)

ఆ నవ్వులో సమాధానం వెతుక్కోవడం ఆనందం వల్లకాలేదు...

ఆ నవ్వుని అర్థం చేసుకునే ప్రయత్నంలో ఆ రాత్రి ఖర్చయింది.

* * *

ఆనందానికి నా అని చెప్పుకోడానికి భార్య జానకి— పిల్లలూ తప్పఎవరూ లేరు..

తల్లీ తండ్రీ ఏనాడో కాలచక్రం మీద ఎక్కి కాటికి వెళ్లిపోయారు...

తిట్టినా, ప్రేమించినా, అభిమానించినా, కోప్పడినా — ఆనందంలో తండ్రి, భర్త, శిశువు, పురుషుడు

ఆశించే ఎలాంటి స్పందనైనా భార్య జానకి ప్రతిస్పందిస్తేనే.

అలాంటిది ఇట్లా యాంత్రికంగా, తనేం చేసినా, ఎట్లా ప్రవర్తించినా మవునంగా తనకేం నిమిత్తం లేనట్లు నవ్వుతూవుండటం.... తాగితే తన ఆరోగ్యం పాడవుతుందని తెల్సి ఒక్కమాటకూడా అనకపోవడం... పట్టించుకోకపోవడం....

ఇది అని ఇదమిద్ధంగా తెలియని అభ్రతలూభావానికి లోనయ్యాడు ఆనందం.

* * *

అందరూ ఆశ్చర్యపోయేలా ఆనందం తాగుడు మానేసాడు.

ఆఫీసులో అందరూ ఆనందాన్ని పొగిడారు... తాగుడంటే తెలియనివాడికన్నా అలవాటుండి మానెయ్యగలిగినవాడు గొప్పవాడన్నారు.

మందుకన్నా నిషా ఇచ్చేది పొగడ్తని అప్పుడే తెల్సింది ఆనందానికి.

ఎంతమంది ఎన్ని విధాలుగా పొగిడినా జానకినించి ఏ విధమైన ప్రసంసారాలేదు. ప్రశంకు కాదుగదా ఆ విషయమై ఎలాంటి కామెంట్ కూడా చెయ్యలేదు.

కానీ అందరికన్నా ఎక్కువ సంతోషించింది జానకే!

అది సుందరమైన కలలాగ భావించింది....

ఈ కల పూర్తిగా నిజమవుతుందన్న నమ్మకం లేదు జానకికి.

తన కలలు పండాయని

నెల గడిచేసరికి నమ్మకతప్పలేదు జానకి.

* * *

ఈ నెలరోజుల్లో భార్య ప్రశంస కోసం చాలాసార్లు ఎదురుచూసినా ఇప్పుడాసంగతి పట్టించుకోవడం లేదు ఆనందం. తాగుడు మానెయ్యడంవల్ల కలిగిన లాభాలు అతనికి ప్రత్యక్షంగా కనబడుతున్నాయి... ఇది వర్లోలా కాకుండా నాలుగురాళ్ళు చేతిలో ఆడుతున్నాయి.

వీటన్నిటినీ మించి నలుగురూ తనతో ప్రవర్తించే విధానంలో గతానికీ ఇప్పటికీ ఎంతో మార్పు కన్పిస్తోంది...

ఆనందం చాలా మారాడు.

* * *

ఆరుబయలు....అరవెన్నల.... ఆనందం కౌగిట్లో అరమోడ్పు కన్నుల్తో తన్మయత్వాన్ని అనుభవిస్తోంది జానకి....

సాటి ఆడవాళ్ళలో పడిపోయిన తనస్థానాన్ని, పరువుని నిలబెట్టిన భర్తమీద ప్రేమ పొంగిపొర్లిపోతోంది... ఇప్పుడు తననెవరూ వేలెత్తి చూపించలేరు. తను ధీమాగా తలెత్తుకు తిరగ్గలదు.... తను జానకి... తన భర్త శ్రీరామచంద్రుడు... భర్తమీద ప్రేమేకాకుండా బోలెడంత గౌరవం కూడా కలిగింది జానకికి.

నెలరోజుల్నించీ దాచుకున్న సంతోషపు అలలు జానకిని ఉక్కిరిబిక్కిరి చేసాయి.... ఆ సంతోషాన్ని దాచుకోవడం జానకి వల్లకాలేదు.

తన సంతోషాన్ని ముద్దులరూపంలో ఆనందం ముఖం మీద ముద్రించింది... ఆనందం గుండెలమీద తల ఆన్చి అంది," మీరెంత మంచివారండీ.... ఈ పాడు తాగుడువల్ల మీరేమైపోతారోనన్న దిగుల్తో చచ్చాను ఇన్నాళ్ళూ...ఏమీ చేయ్యలేని నిస్సహాయురాలినై లోపల్లోపలే దిగుల్తో కుమిలిపోయాను.... చాతకాక నవ్వుతూ తిరిగాను.... ఏదేవుడు కరుణించాడో మనల్ని మీరు తాగుడు మానేసారు. మీరు తాగుడుమానితే తిరుపతికి వస్తానని మొక్కుకున్నాను... ఇప్పుడు మీ ఆరోగ్యం గురించీ, ఈ సంసారం గురించీ ఎంత నిశ్చింతగా వుందనుకున్నారు... మిమ్మల్ని అందరూ వేలెత్తి చూపిస్తారా? ఇప్పుడు చూపించమనండి....." ఆవేశంతో తన మనసులో వున్న ప్రతి మాటా చెప్పేసింది.... తన మాటలు భర్తలో ఎలాంటి సంచలనం కలిగిస్తాయో జానకికి తెలియదు. తెలిస్తే పెదవి కదిపేది కాదేమో!

ఆనందం ఏదో అందామని పెదవులు కదిల్చాడు.

జానకి పెదవులు ఆనందం పెదవుల్ని కదలనిచ్చాయి కాదు.

* * *

మర్నాడు,

ఆనందం ఎప్పటిలా తాగి ఇంటికి వచ్చాడు! *

ఆగలేవా!

